సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 8 । అక్టోబర్ । 2023



లారీలపై కేసులు

పరిమితికి మించి లోడ్‌తో రేషన్ బియ్యం సరఫరా చేస్తున్న లారీలపై రవాణా శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. 8లో



చెస్ చాంప్స్ ఆన్ష్, ప్రతీతి

36వ జాతీయ అండర్-11 చదరంగం చాంపియన్‌షిప్‌ను ఓపెన్ బాలురలో ఆన్ష్ నందన్, బాలికల్లో ప్రతీతి సాధించారు. 8లో



పలు రైళ్ల రద్దు

విజయవాడ డివిజన్‌లో ఆధునీకీకరణ పనుల కారణంగా పలు రైళ్లు రద్దు చేసినట్లు అధికారులు వెల్లడించారు. 8లో

న్యూస్‌రీల్

విశాఖ వందనం ప్రచార రథం పరిశీలన



రథాన్ని పరిశీలిస్తున్న సుబ్బారెడ్డి

సాక్షి, విశాఖపట్నం: విజయదశమి నుంచి విశాఖ కేంద్రంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన ప్రారంభించనున్న నేపథ్యంలో నాన్ పొలిటికల్ జేఏసీ స్వాగత ఏర్పాటు చేస్తోంది. ఈ నేపథ్యంలో విశాఖ వందనం పేరిట ప్రచార రథం ప్రారంభించింది. ఈ రథాన్ని శనివారం ఎండాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయం వద్ద పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి పరిశీలించారు. జేఏసీ చైర్మన్ లజపతిరాయ్‌తో పాటు పార్టీ నేతలు పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్య భాగ్యం

శనివారం 3,805 మందికి వైద్య సేవలు



బాలాజీనగర్ యూపీహెచ్‌సీలో రోగులకు మందులు ఇస్తున్న వైద్య సిబ్బంది

మహారాణిపేట: జిల్లాలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో 3,805 మందికి వైద్య సేవలందించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. అర్బన్ పరిధిలో బాలాజీనగర్(ఆరిలోవ), సుబ్బలక్ష్మి కల్యాణ మండపం(రైల్వే న్యూకాలనీ), దేవాడ పీహెచ్‌సీ పరిధిలో దేశపాత్రునిపాలెం, రూరల్‌లో రాంపురం(పెందుర్తి), బోని(ఆనందపురం), పొట్నూరు(భీమిలి), మజ్జివలస(పద్మనాభం) వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల్లో ఈ శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు. స్త్రీ వైద్యురాలు, పిల్లల వైద్యులు, జనరల్ ఫిజిషియన్, దంత వైద్యులు హాజరై రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు డీఎంహెచ్‌వో వివరించారు.

నేటి నుంచి ఇంటర్ సర్టిఫికెట్ల పంపిణీ

విశాఖ విద్య: ఇంటర్ పరీక్షల్లో పాసైన విద్యార్థులకు ఆదివారం నుంచి ఒరిజినల్ సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు ఆర్‌ఐవో రాయల సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది మార్చి, మే నెలల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఒరిజినల్ పాస్ మెమోలు విశాఖలోని పిఠాపురం కాలనీలో గల ఆర్‌ఐవో కార్యాలయానికి వచ్చాయన్నారు. వీటిని తీసుకునేందుకు ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల ప్రిన్సిపాల్స్ ఆదివారం ఉదయం 10 గంటలకు రావాలన్నారు. ఉత్తీర్ణత ధృవీకరణ పత్రాలను ఇక నుంచి డిజిలాకర్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. విద్యార్థులందరితో వారి మొబైల్ ఫోన్లలో డిజిలాకర్ యాప్ డౌన్‌లోడ్ చేయించాలన్నారు. దీనిపై ప్రిన్సిపాల్స్‌కు ఆదివారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశామన్నారు.

ఉష్ణ 'తాపం'

- కొన్నాళ్లుగా కొనసాగుతున్న ఉష్ణతాపం
- సాధారణం కంటే 3–5 డిగ్రీలు అధికం
- గాలిలో తక్కువ తేమ, వాయవ్య గాలులే కారణం
- ఈశాన్య రుతుపవనాలు వచ్చే దాకా ఇదే పరిస్థితి..

వారం రోజుల్లో ఉష్ణోగ్రతలు

తేదీ	ఉష్ణోగ్రత	వ్యత్యాసం
01.10.23	35.6	+2.8
02.10.23	32.2	-0.6
03.10.23	35.4	+3.0
04.10.23	37.6	+5.2
05.10.23	37.2	+4.8
06.10.23	36.2	+3.8
07.10.23	35.2	+2.8

సాక్షి, విశాఖపట్నం: సెప్టెంబర్ నెలలో వర్షాలు దంచి కొడతాయి. అక్టోబర్‌లోనూ అవి కొనసాగుతాయి. వానలు, చల్లని గాలులతో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. కానీ ఈ సంవత్సరం పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. అక్టోబర్‌కు ముందు నుంచీ వేసవిని తలపించే వాతావరణమే కనిపిస్తోంది. దాదాపు పక్షం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3–5 డిగ్రీల వరకు అధికంగా నమోదవుతున్నాయి. విశాఖలో సాధారణంగా వేసవిలో ఎక్కువ రోజులు 36–39 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు రికార్డవుతాయి. మే నెలలో కొద్ది రోజులు మాత్రమే అవి 40–41 డిగ్రీలకు చేరతాయి. అలాంటిది కొన్నాళ్లుగా వైజాగ్‌లో 35–38 డిగ్రీల వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. దీంతో ఎండలు సెగలు పుట్టిస్తున్నాయి. ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఉష్ణతాపాన్ని భరించాల్సి వస్తోంది. అప్పుడప్పుడు మధ్యలో మేఘాలు కాస్త అడ్డుకుంటున్నా, కాసేపటికే మళ్లీ షరా మామూలే అవుతోంది. పగటి పూట చుర్రుమంటున్న ఈ వాతావరణంతో జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటా బయటా అవస్థలు పడుతున్నారు. వేసవి కాలాన్ని తలపించే వాతావరణంతో అదే పనిగా ఏసీలు, ఫ్యాన్లతో ఉపశమనం పొందనిదే ఇళ్లలో ఉండలేకపోతున్నారు.

కనిష్ట ఉష్ణోగ్రతలదీ అదే దారి..

మరోవైపు రాత్రి (కనిష్ట) ఉష్ణోగ్రతల పరిస్థితీ అలాగే ఉంటోంది. ఇవి కూడా సాధారణం కంటే 2–4 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. సాధారణంగా అక్టోబర్ నెలలో విశాఖలో కనిష్ట ఉష్ణోగ్రతలు 22–24 డిగ్రీల మధ్య రికార్డవుతాయి. కానీ వారం పది రోజులుగా అవి 24–28 డిగ్రీలకు పైగా చేరుకుంటున్నాయి. ఉదాహరణకు ఈనెల ఒకటో తేదీన 28.4, రెండున 27.7, మూడున 26.8 చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఫలితంగా రాత్రి వేళ ఉపశమనం లభించడం లేదు. దీంతో పగలు మాదిరిగానే రాత్రులు కూడా ప్రజలు ఫ్యాన్లు, ఏసీలనూ తప్పనిసరిగా వినియోగించాల్సి వస్తోంది. తెల్లవారుజామునకి వాతావరణం కాస్త చల్లబడుతోంది.



ఎండల తీవ్రతకు దర్పణం ఈ చిత్రం

ఎందుకీ పరిస్థితి?

ప్రస్తుత పరిస్థితికి వాతావరణ నిపుణులు పలు కారణాలను వివరిస్తున్నారు. కొన్నాళ్ల నుంచి గాలిలో తేమ కూడా తక్కువగా ఉంటోంది. ఉత్తరాదిలో వర్షాలు కురవడం లేదు. అలాగే రాష్ట్రంపైకి చల్లదనాన్నిచ్చే నైరుతి గాలులు గాని, సముద్రంపై నుంచి వీచే దక్షిణ గాలులు రావడం లేదు. వాటి స్థానంలో వేడిగా ఉండే వాయవ్య గాలులు వీస్తున్నాయి. వెరసి రాష్ట్రంలో సాధారణంకంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదుకు దోహదపడుతున్నాయని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం డైరెక్టర్ సునంద 'సాక్షి'కి చెప్పారు. ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించే వరకు (మరో రెండు వారాల పాటు) ఇంచుమించుగా ఇవే ఉష్ణోగ్రతలు కొనసాగే అవకాశం ఉందని తెలిపారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం



మంచా మల్లీశ్వరిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వై.వి. సుబ్బారెడ్డి

- పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి
- వైఎస్సార్‌సీపీలో చేరిన బీజేపీ నేత డాక్టర్ మంచా నాగమల్లీశ్వరి

కొమ్మాది: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ఎండాడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో బీజేపీ నేత డాక్టర్ మంచా నాగమల్లీశ్వరి వైఎస్సార్ సీపీలో చేరారు. ఆమెకు వై.వి.సుబ్బారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నిజాయతీ పాలన ప్రజల మనసులు దోచుకుందని, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మదిలో మెదిలిన గొప్ప ఆలోచన అన్నారు. రానున్న ఎన్నికల్లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో మంచి మెజార్టీతో పార్టీని గెలిపించుకోవాలని క్యాడర్‌కు పిలుపునిచ్చారు. మహిళల పట్ల అసభ్యకరంగా మాట్లాడుతున్న ప్రతిపక్ష నేతలను చరిత్ర ఎన్నటికీ క్షమించదన్నారు. సీఎం జగన్ పరిపాలన విధానం, సంక్షేమ పథకాల అమలు తీరుకు ఆకర్షితురాలినై వైఎస్సార్ సీపీలో చేరినట్లు డాక్టర్ నాగమల్లీశ్వరి తెలిపారు. రాష్ట్రంలో మహిళలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించారన్నారు. పార్టీ అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఉత్తర సమన్వయకర్త కె.కె. రాజు, సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జి వంకాయల మారుతీ ప్రసాద్, పార్టీ ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, వై.వి.యువశక్తి రాష్ట్ర అధ్యక్షుడు వంపుగడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం నగర పర్యటనకు ఏర్పాట్లు

సాక్షి, విశాఖపట్నం/డాబాగార్డెన్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 16న నగర పర్యటన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రుషికొండలోని ఐటీ హిల్స్‌లో ఇన్ఫోసిస్ ఐటీ డెవలప్‌మెంట్ సెంటర్ కార్యకలాపాలను సీఎం జగన్ ప్రారంభించనున్నారు. కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సందర్శించి.. శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కలెక్టర్ డా.మల్లికార్జున, సీపీ డా.రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ శనివారం ఆయా ప్రాంతాల్లో పర్యటించి ఏర్పాట్లపై సమీక్షించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కాగా.. ఇన్ఫోసిస్ కార్యకలాపాలు ప్రారంభంతో ఐటీ రంగంలో కొత్త ఉత్సాహం మొదలుకానుంది. తొలుత 650 మందితో కార్యకలాపాలు ప్రారంభించి.. త్వరలోనే వెయ్యి మందికి విస్తరించనున్నట్లు అధికారులు వెల్లడించారు. విశాఖ నుంచి సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ఐటీ అనుబంధ సేవలు, ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్స్ తదితర సేవలు అందించాలని ఇన్ఫోసిస్ భావిస్తోంది. కమిషనర్ వెంట జీవీఎంసీ అధికారులు ఉన్నారు.



ఇన్ఫోసిస్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

మధ్యవర్తిత్వం ద్వారా కేసుల రాజీ

విశాఖ–లీగల్: మధ్యవర్తిత్వం ద్వారా కేసులు రాజీ చేసుకుంటే ఉభయులకు లాభదాయకమని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి అలపాటి గిరిధర్ అన్నారు. శనివారం జిల్లా కోర్టులోని సమావేశ మందిరంలో వివిధ కంపెనీలు, న్యాయవాదులతో పౌర శిక్షాస్మృతి సెక్షన్– 89 మధ్యవర్తిత్వం అన్న అంశంపై ప్రత్యేక సదస్సు జరిగింది. ఈ సదస్సులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గిరిధర్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో స్వల్ప కారణాలతో వివాదాలు పెరుగుతున్నాయన్నారు. సెక్షన్ 89 ఊటంకిస్తూ పలు కేసులను ఉదహరించారు. ప్రతి చిన్న విషయానికి న్యాయస్థానాల ఆశ్రయించడం వల్ల ఎన్నో నష్టాలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాలు తమకు అనుకూలమైన వాదనలను వినిపించి అంగీకారంతో కేసులను రాజీ చేసుకుంటే కలిగే ఫలితాలను విశ్లేషించారు. సీబీఐ కోర్టు న్యాయమూర్తి సీఎన్ మూర్తి మాట్లాడుతూ మధ్యవర్తిత్వ చట్టం వివిధ సెక్షన్లను వివరించారు. ఏసీబీ కోర్టు న్యాయమూర్తి సువర్ణ రాజు మాట్లాడుతూ మధ్యవర్తితో పలు లాభాలు ఉన్నట్లు చెప్పారు. వాణిజ్య న్యాయస్థానం న్యాయమూర్తి కేశవాచార్యులు ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి జి.శ్రీదేవి, రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి, విశాఖ, అనకాపల్లి, ఏఎస్ఆర్ జిల్లా న్యాయమూర్తులు సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు, మెట్రోపాలిటీ మెజిస్ట్రేట్‌లు, మెజిస్ట్రేట్లు, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, కార్యదర్శి శ్రీనివాసు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సీనియర్ సభ్యుడు ఎస్. కృష్ణమోహన్, మధ్యవర్తిత్వ న్యాయవాదులు, మరికొందరు న్యాయమూర్తులు ఆన్లైన్ ద్వారా కూడా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి అలపాటి గిరిధర్

నిందితులకు శిక్షలు పడేలా చర్యలు

పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశం

దొండపర్తి : తీవ్ర నేరాలకు పాల్పడిన వారికి వేగవంతంగా శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఏసీపీలను ఆదేశించారు. శనివారం పోలీస్ సమావేశ మందిరంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీస్ ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కేసులు కోర్టులలో త్వరితగతిన విచారణకు వచ్చి, కేసుల తీవ్రతను బట్టి శిక్షల శాతం పెరిగేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. కేసుల విషయంలో ఇరుశాఖలు మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు ఉమ్మడి కార్యాచరణ రూపొందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఏసీపీ స్థాయి అధికారులు క్రమం తప్పకుండా స్టేషన్ ఇన్‌స్పెక్టర్లతో మాట్లాడుతూ ఉండాలని, అవసరం మేరకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల ద్వారా సదరు కేసులకు సంబంధించిన విషయాలపై అవగాహన ఏర్పరచుకోవాలని సూచించారు. తీవ్ర నేరారోపణల కేసులు, మహిళలపై అఘాయిత్యాలు జరిగిన కేసుల విషయంలోను, ఎక్కువ కేసులు ఉన్న రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, గంజాయి పెడలర్లపై నిరంతరం దృష్టి పెట్టాలని ఆదేశించారు. అటువంటి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి కేసులోను నిందితుడికి శిక్ష పడేలా పనిచేయాలని, అందుకు అనుగుణంగా ప్రతి కేసు నమోదు నుంచి శిక్ష పడే వరకు పూర్తి మోనిటరింగ్ చేయాలన్నారు. ప్రతి నెలా శిక్ష పడుతున్న కేసుల సంఖ్య పెరగాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ–1 కె.శ్రీనివాసరావు, డీసీపీ(క్రైం) జి.నాగన్న, డీసీపీ–2 కె.ఆనంద రెడ్డి, ఇతర పోలీస్ అధికారులు, నగరానికి చెందిన పలు కోర్టుల పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ డాక్టర్ ఎ.రవిశంకర్

న్యాయవిద్యలో సెల్ఫ్ సపోర్ట్ కోర్సులకు దరఖాస్తులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాలలో సెల్ఫ్‌సపోర్ట్ విధానంలో ఐదేళ్ల, మూడేళ్ల న్యాయ విద్యలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ. నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల న్యాయవిద్యలో 15 మందికి, ఐదేళ్ల న్యాయవిద్యలో 18 మందికి ప్రవేశం కల్పిస్తామని పేర్కొన్నారు. కోర్సు ఫీజుగా ఏడాదికి రూ. 90 వేలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. లాసెట్, క్లాట్‌లో సాధించిన ర్యాంక్ ఆధారంగా ప్రవేశం కల్పిస్తామని తెలియజేశారు. మూడేళ్ల న్యాయవిద్యకు డిగ్రీ ఉత్తీర్ణత, ఐదేళ్ల న్యాయకోర్సుకు ఇంటర్ ఉత్తీర్ణత కలిగి ఉండాలని తెలిపారు. ఇతర వివరాలకు ప్రవేశాల సంచాలకుల వెబ్‌సైట్ www.audoa.in ను పరిశీలించాలని సూచించారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు ఈ నెల 20వ తేదీలోగా తమ దరఖాస్తులను ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో అందజేయాలని వివరించారు.

నేడు విశాఖకు మంత్రుల రాక

మహారాణిపేట: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర, రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖమంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదివారం విశాఖ వస్తున్నారు. మంత్రి రాజన్నదొర సాలూరు నుంచి రోడ్డు మార్గంలో ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకుని, రాత్రి 11గంటలకు రైల్లో విజయవాడ వెళ్లనున్నారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు మధ్యాహ్నం 3.30 గంటలకు సర్క్యూట్ హౌస్‌కు చేరుకుని, సాయంత్రం 4.35 గంటలకు విమానంలో విజయవాడ వెళ్తారు.

పింఛన్ల సొమ్ముతో వెల్ఫేర్ సెక్రటరీ పరారీ



విల్సన్ బాబు (ఫైల్)

గాజువాక : జీవీఎంసీ గాజువాక జోన్‌లోని సచివాలయ ఉద్యోగి పింఛన్ల సొమ్ముతో పరారైన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. అతడిని పట్టుకోవడానికి జోనల్ అధికారులు చేసిన అన్ని ప్రయత్నాలు విఫలం కావడంతో పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. జోనల్ కమిషనర్ పి.సింహాచలం తెలిపిన వివరాలివీ.. 65వ వార్డు సంజీవగిరి కాలనీ సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ విల్సన్ బాబు తన రెండు సచివాలయాల పరిధిలోని లబ్దిదారులకు పింఛన్లు అందజేయడం కోసం గత నెలాఖరున రూ.1,40,500 విత్ డ్రా చేశాడు. ఈ నెల 1న పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉన్నప్పటికీ విల్సన్‌బాబు గైర్హాజరయ్యాడు. రెండు రోజుల తర్వాత లబ్దిదారులు సచివాలయానికి వెళ్లి తమ పింఛన్ ఇవ్వాలని అడగడంతో విల్సన్‌బాబు విధులకు రావడంలేదని బదులిచ్చారు. దీంతో లబ్దిదారులు జోనల్ కమిషనర్‌ను సంప్రదించి విషయం వివరించారు. అతడిని ఫోన్‌లో సంప్రదించడానికి జెడ్సీ ప్రయత్నించగా స్విచాఫ్ రావడంతో షోకాజ్ నోటీసును జారీ చేశారు. సంజీవగిరి కాలనీ సచివాలయానికి చెందిన వలంటీర్లను విల్సన్‌బాబు సొంత ఊరైన నర్సీపట్నానికి పంపించి సమాచారం తెలుసుకోవాలని చెప్పారు. వారు నర్సీపట్నం వెళ్లగా అతడి ఇంటికి తాళం వేసి ఉంది. వారం రోజులుగా అతడు విధులకు హాజరు కాకపోవడం, ఎవరికీ చెప్పకుండా పింఛన్ల సొమ్ము తీసుకొని వెళ్లిపోవడంతో జెడ్సీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకొని అతడిని విధుల నుంచి సస్పెండ్ చేస్తామని జెడ్సీ ఈ సందర్భంగా తెలిపారు.

నేడు నేషనల్ డాగ్ షో

డాబాగార్డెన్స్: విశాఖ కెన్నెల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డు ఎంజీఎం గ్రౌండ్‌లో ఆదివారం నేషనల్ డాగ్ షో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి కె.శ్రీకృష్ణ తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 7 గంటల వరకు షో ఉంటుందని, దేశవ్యాప్తంగా గల 45 జాతులకు చెందిన 250 డాగ్స్ పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. బెంగళూరుకు చెందిన యశోధర, ప్రీతమ్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించనున్నారని తెలిపారు. కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితర ప్రముఖులు డాగ్ షోను ప్రారంభిస్తారని వెల్లడించారు.

మిసెస్ వైజాగ్ పోటీలు నేడు

డాబాగార్డెన్స్: భీమిలి బీచ్‌రోడ్డులోని వైజాగ్ ఫిల్మ్‌నగర్ కల్చర్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం మిసెస్ వైజాగ్–2023 పోటీలు నిర్వహించనున్నట్లు వైజాగ్ ఫిల్మ్‌నగర్ క్లబ్ అడ్మినిస్ట్రేటివ్ చైర్మన్ కంటిపూడి వెంకటేశ్వరరావు, హేంప్‌షైర్ ఈవెంట్ మేనేజర్ వాసు తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు కాయిత వెంకట్‌రెడ్డి, డైరెక్టర్ ఎంఎస్ఎన్ రాజు, కార్యదర్శి శ్రీనివాసరాజు, సహాయ కార్యదర్శి అశోక్‌రెడ్డి, కోశాధికారి గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయని వెల్లడించారు.

చెస్ చాంపియన్స్ ఆన్ష్, ప్రతీతి

ముగిసిన 36వ జాతీయ అండర్–11 చదరంగం చాంపియన్‌షిప్

విశాఖ స్పోర్ట్స్: 36వ జాతీయ అండర్–11 చదరంగం చాంపియన్‌షిప్‌ను ఓపెన్ బాలురలో ఆన్ష్ నందన్, బాలికల్లో ప్రతీతి సాధించారు. ఇక్కడి పోర్ట్ స్టేడియంలో శనివారంతో ముగిసిన 11 రౌండ్ల అనంతరం ఆన్ష్(మహారాష్ట్ర) పది పాయింట్లతో, ప్రతీతి(కర్నాటక) తొమ్మిదిన్నర పాయింట్లతో విజేతలుగా నిలిచారు. ఓపెన్‌లో తొమ్మిదేసి పాయింట్లతో ముగించిన సిద్ధాంత్, సయిద్(కర్ణాటక), మయూక్(పశ్చిమ బెంగాల్), ఆదిక్(కేరళ) టాప్ 5లో నిలిచారు. బాలికల్లో తొమ్మిది పాయింట్లతో సిద్ధి(కర్నాటక) రెండో స్థానంలో నిలవగా ఎనిమిదిన్నరేసి పాయింట్లతో ఏఎఫ్ఎం మైషా(మహారాష్ట్ర), పవిత్ర(తమిళనాడు), శరణ్య(తెలంగాణ) తర్వాత స్థానాలు సాధించారు. చివరిదైన 11వ రౌండ్‌లో ఓపెన్ టాప్ బోర్డ్‌పై ఆన్ష్ వేసిన ఎత్తులకు ఎ.ఆరవ్(తమిళనాడు) ఓటమి పాలవడంతో ఎనిమిదిన్నర పాయింట్లకే పరిమితమయ్యాడు. బాలికల టాప్ బోర్డ్‌పై చివరిదైన 11వ రౌండ్‌లో ప్రతీతి ఎత్తులకు చిత్తయిన ఆముక్త(ఏపీ) ఎనిమిది పాయింట్లతో టోర్నీకి ముగింపు పలికింది. ఆంధ్రా చెస్, ఆల్ విశాఖ చెస్ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ చాంపియన్‌షిప్ నిర్వహించగా.. 27 రాష్ట్రాలకు చెందిన చిన్నారులు పాల్గొన్నారు. టోర్నీలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారిని ప్రపంచ అండర్–12 చెస్ చాంపియన్‌షిప్‌కు ఎంపిక చేశారు.

ఏపీ చిన్నారుల సత్తా : ఈ చాంపియన్‌షిప్‌లో మన రాష్ట్రానికి చెందిన చిన్నారులు సత్తా చాటారు. టోర్నీలో మొత్తంగా ఏపీకి చెందిన 42 మంది ఓపెన్, బాలికల విభాగాల్లో తలపడగా పలువురు టాప్‌లో నిలిచి నగదు ప్రోత్సాహకాలను సాధించారు. వీరిలో త్రిపురాంబిక 6వ స్థానంలో నిలిచి రూ.15 వేలు, ఓపెన్‌లో అఖిల్ ప్రసాద్ 12వ స్థానంలో నిలిచి రూ.10వేలు అందుకున్నారు. చివరి రౌండ్‌లో సైతం టాప్ 10 బోర్డులపైనే ఏపీ చిన్నారులు పోటీపడ్డారు. వీరిలో శ్రావ్య శ్రీ 8వ స్థానంలో, టోర్నీ టాపర్‌గా బరిలోకి దిగిన ఆముక్త రెండు పరాజయాలతో 10వ స్థానంతో సరిపుచ్చింది. రిషిత 14, భవన్య 28వ స్థానానికి దిగజారారు. ఓపెన్‌లో శ్యామ్యూల్ 15, ఏపీ తరఫున టాపర్‌గా టోర్నీ ప్రారంభించిన హేమల్ వర్షణ్ 27వ స్థానంతో సరిపుచ్చారు.



చెస్ విజేతలతో వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, నిర్వాహకులు

రూ.లక్ష ప్రోత్సాహం.. ఊహించలేదు

ఈ పోటీల్లో టాప్ బోర్డులపై ఆడాను. 13వ ర్యాంక్‌తో ఆరంభించి 6వ స్థానంతో ముగించడం చాలా ఆనందాన్నిచ్చింది. 11 రౌండ్లలో చివరి ఎనిమిది రౌండ్‌లు టాప్ 10 బోర్డులపైనే ఆడటం.. మొదటి తొమ్మిది రౌండ్లలో పరాజయం లేకుండా ముందుకు సాగడం ద్వారానే ఇది సాధ్యపడింది. నా ఫిడే రేటింగ్ 1,342. ఈ టోర్నీలో 8 పాయింట్లు సాధించాను. మన రాష్ట్ర ప్రభుత్వం నాకు లక్ష రూపాయలను ప్రోత్సాహకంగా అందించడం నేను ఊహించలేదు. భవిష్యత్‌లో మరింత మెరుగైన ఆటను ప్రదర్శిస్తాను. –త్రిపురాంబిక

భవిష్యత్ టోర్నీల్లో మరింతగా రాణిస్తా..

చాంపియన్‌షిప్‌లో 21వ ర్యాంక్‌తో 1,553 ఫిడే రేటింగ్‌తో తొలి ఎత్తును డిఫెండ్ చేసుకునేందుకు నల్ల పావులతోనే ప్రారంభించి విజయం సాధించాను. చివరికి 12వ ర్యాంక్‌తో ముగించడం చాలా సంతోషాన్నిచ్చింది. రెండో ర్యాంకర్ సీఎం వివాన్‌పై విజయం సాధించడం మరిచిపోలేను. ఆట ద్వారా రూ.10 వేలు అందుకోగా.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.లక్ష రూపాయలు అందించారు. ఆటను మరింత మెరుగుపరచుకుని.. భవిష్యతో టోర్నీలో రాణించేందుకు కృషి చేస్తాను. – అఖిల ప్రసాద్, 12వ ర్యాంకర్

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

- వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి
- ఏపీకి చెందిన విజేతలకు ప్రభుత్వం తరఫున చెరో లక్ష అందజేత

విశాఖ స్పోర్ట్స్: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. జాతీయ స్థాయిలో టాపర్లుగా నిలిచిన వారు ఆసియన్, కామన్వెల్త్, వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్ ఆడే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జాతీయ అండర్–11 చదరంగం చాంపియన్‌షిప్ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై ఏపీ నుంచి బాలికల టాపర్ త్రిపురాంబిక, ఓపెన్ టాపర్ అఖిల్‌కు చెరో లక్ష ప్రోత్సహకాన్ని అందించారు. ఈ టోర్నీలో రెండు విభాగాల్లో టాప్–20ల్లో నిలిచిన వారికి నిర్వాహకులు రూ.8 లక్షలు అందించారు. విజేతకు రూ.70 వేలు, 2 నుంచి 6వ స్థానాల్లో నిలిచిన వారికి వివిధ స్థాయిలో నగదు బహుమతులు, 7–20వ స్థానాల్లో నిలిచిన వారికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున ప్రదానం చేశారు. అయితే టోర్నీ విజేత కంటే ఎక్కువ మొత్తాన్ని ఏపీ విజేతలకు ప్రభుత్వం తరఫున ప్రకటించడంతో చిన్నారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఏడు రోజుల పాటు స్విస్ లీగ్ పద్ధతిలో సాగిన టోర్నీలో ప్రతీ రౌండ్ ఉత్కంఠగా సాగింది. చివరికి ఓపెన్‌లో ఆన్ష్, సిద్ధాంత్, సయిద్, బాలికల్లో ప్రతీతి, సిద్ధి, మైషా తొలి మూడు స్థానాల్లో నిలిచి సుబ్బారెడ్డి చేతుల మీదుగా ట్రోఫీలు, నగదు బహుమతులు అందుకున్నారు. డిప్యూటీ మేయర్ సతీష్, నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, జి.కె.వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు కాశీ విశ్వనాథ్, చొక్కాకుల వెంకటరావు, ఆంధ్రా చెస్ సంఘం అధ్యక్షుడు కె.వి.వి.శర్మ పాల్గొన్నారు.



అధిక లోడ్ లారీలపై కేసులు

మద్రిపాలెం: ఆర్‌అండ్‌బీ జంక్షన్ వద్ద గల పౌర సరఫరాల గొడౌన్లలో పరిమితికి మించి లోడ్‌తో రేషన్ బియ్యం సరఫరా చేస్తున్న లారీలపై శనివారం రవాణా శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. ఒక్కొక్క లారీలో పరిమితికి మించిన రేషన్ బియ్యం ఉండడంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ జి.స్వరూపారాణికి సమాచారం అందించారు. ఆమె ఆదేశాల మేరకు విజిలెన్స్ సీఐ తిరుపతిరావు అక్కడకు చేరుకున్నారు. అధిక లోడుతో ఉన్న మూడు లారీలను గుర్తించి రూ.1,67,000 అపరాధ రుసుం విధించారు. నిబంధనల మేరకే రేషన్ బియ్యం పౌర సరఫరాల గొడౌన్‌కు వచ్చాయని అధికారులు తెలిపారు.

లారస్ ల్యాబ్స్ అధినేతకు బెస్ట్ సీఈవో అవార్డు

పరవాడ: లారస్ ల్యాబ్స్ వ్యవస్థాపక అధినేత చావా సత్యనారాయణ దేశంలోనే బెస్ట్ సీఈవో అవార్డు లభించిందని లారస్ ల్యాబ్స్ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. బెస్ట్ సీఈవోగా ఎంపికైన చావా సత్యనారాయణకు లారస్ ల్యాబ్స్ కుటుంబం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది.

19 నుంచి సీనియర్ వుమెన్ టీ-20

విశాఖ స్పోర్ట్స్: బీసీసీఐ అంతర్ రాష్ట్ర సీనియర్ వుమెన్ టీ–20 క్రికెట్ టోర్నీ ఈనెల 19 నుంచి రాయ్‌పూర్‌లో జరగనుంది. 30వ తేదీతో ముగిసే ఈ టోర్నీలో ఆంధ్రా వుమెన్ జట్టు ఆరు మ్యాచ్‌లు ఆడనుంది. ఈ వుమెన్ జట్టుకు మేనేజర్‌గా వై.వెంకటేష్ వ్యవహరించనున్నారు.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం : విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం విశాఖ నుంచి, విశాఖ మీదుగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. • ఈ నెల 9 నుంచి 15 వరకు రాజమండ్రి – విశాఖపట్నం – రాజమండ్రి (07466/07467) పాసింజర్ స్పెషల్ రద్దు. • ఈ నెల 9 నుంచి 15 వరకు గుంటూరు – విశాఖపట్నం (17239) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు. • ఈ నెల 10 నుంచి 16 వరకు విశాఖపట్నం – గుంటూరు (17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు. • ఈ నెల 9, 10, 11, 13, 14న విశాఖపట్నం – విజయవాడ – విశాఖపట్నం (22701/22702) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ రద్దు. • ఈ నెల 9 నుంచి 15 వరకు మచిలీపట్నం – విశాఖపట్నం (17219) ఎక్స్‌ప్రెస్ రద్దు. • ఈ నెల 10 నుంచి 16 వరకు విశాఖపట్నం – మచిలీపట్నం (17220) ఎక్స్‌ప్రెస్ రద్దు.

పలు రైళ్ల దారి మళ్లింపు: ఈ కింద సూచించిన రైళ్లు ఆయా తేదీల్లో రెగ్యులర్ మార్గం నిడదవోలు – ఏలూరు – విజయవాడ మీదుగా కాకుండా నిడదవోలు – భీమవరం టౌన్ – గుడివాడ – విజయవాడ మీదుగా నడుస్తాయి. • ధన్‌బాద్‌లో ఈ నెల 9 నుంచి 16 వరకు బయల్దేరే ధన్‌బాద్ – అలెప్పీ (13351) బొకారో ఎక్స్‌ప్రెస్ • టాటానగర్‌లో 13న బయల్దేరే టాటానగర్ – ఎస్ఎంవీ బెంగళూరు (12889) ఎక్స్‌ప్రెస్ • టాటానగర్‌లో 12న బయల్దేరే టాటానగర్ – యశ్వంత్‌పూర్ (18111) ఎక్స్‌ప్రెస్ • హతియాలో ఈ నెల 10న బయల్దేరే హతియా – ఎస్ఎంవీ బెంగళూరు (12835) ఎక్స్‌ప్రెస్ • జసిద్దిలో 11న బయల్దేరే జసిద్ది – తాంబరం (12376) ఎక్స్‌ప్రెస్ • హతియాలో 9న బయల్దేరే హతియా – ఎర్నాకుళం (22837) ఎక్స్‌ప్రెస్ మళ్లించిన మార్గంలో నడుస్తాయి.

బెంగళూరు స్పెషల్ దారి మళ్లింపు

ఈ నెల 8న విశాఖ– ఎస్ఎంవీ బెంగళూరు (08543) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్ మార్గంలో కాకుండా వయా విజయవాడ, గుంటూరు, నంద్యాల, ధర్మవరం మీదుగా నడుస్తుంది. అందువల్ల ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జాలర్‌పేట, కుప్పం, బంగార్‌పేట, కృష్ణరాజపురం స్టేషన్లలో హాల్ట్ ఉండదు.

సండే క్లాసిఫైడ్స్ సాక్షి

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.